

# వెళ్ళిపోయింది

డి. కామేశ్వరి

"విజయా,..... విజ్జీ!" పోర్టికోలో జీపుదిగి బూట్లు టక టక లాడించు' కుంటూ హడావిడిగా లోపలికి వచ్చాడ్న మేజర్ శ్రీధర్.

బెడ్‌రూములో బేబికి డ్రస్సుచేస్తున్న విజయ 'ఏమిటన్నట్టు' చూసింది.

"నీకో న్యూస్ యివాళ!" బేబి బుగ్గ మీద పాట్‌చేస్తూ అన్నాడు శ్రీధర్.

"ఏమిటూన్యూస్!.... ఎవరైన డిన్నరుకి పిల్చారా? మీరెవరినైనా పార్టీకి ఆహ్వానించారా? లేక మీ హోల్డ్‌వూన్ మారాడా?' వేళాకోళంగా అడిగింది విజయ.

శ్రీధర్ దృష్టిలో ప్రతిదీ హో పెద్ద వార్తే! తోటి ఆఫీసరుకి బదిలీఅవుతే అదో న్యూస్. ఎవరైనా పార్టీకి ఆహ్వానిస్తే అదోవార్త, పై అధికారి మారితే వార్త. యిలాంటి వార్తలన్నీ వినడం అలవాటయిన విజయ మామూలు ధోరణిలో వేళాకోళం చేసింది.

శ్రీధర్ కూడ నవ్వేస్తూ "నీకంతా వేళాకోళంగావుంది గాని యీ మారు అలాంటిదేంకాదు. ..... చెప్పుకో చూద్దాం." మంచం మీద కూర్చుని బూటు లేసులు విప్పసాగాడు.

"ఏమిటబ్బా అంత గొప్ప న్యూస్!" ఆశ్చర్యం అభినయించింది విజయ.

"నీ వూహించలేవులే!" భార్యవంక నవ్వుతూ చూశాడు.

యీసారి విజయ కళ్లలో కుతూహలం కనిపించింది. "ఏమిటది? చెప్పండి త్వరగా, ప్లీజ్!" ఆత్రుతగా చూసింది.

"ఏంటే, యిందాకటి వేళాకోళం అంతా ఏమవుతుందీ మరి!" తాపీగా బెర, బెల్ట్ వూడదీయసాగాడు.

ఒక్కసారి విజయ ముఖంలో రంగులు మారాయి. ఆందోళనగా, "చెప్పండి, త్వరగా ఏమిటయింది? అందరూబాగున్నారా?.... టెలిగ్రాం ఏదన్నా వచ్చిందా?' అడిగింది.'

"అలాంటిదేంకాదు!" నవ్వాడు శ్రీధర్.

"ఏమిటో చెప్పెయ్యి! చెప్పకూడదా త్వరగా?" చికాకు పడింది విజయ.

"ఎందుకంత గాభరా, ఏంలేదు విజ్జీ. అనుకున్నదే, ఏక్షణాన్నయినా రావచ్చునని అనుకుంటున్నదే, అదే, తెలుసుగా పాకీస్థాన్‌లో యుద్ధం!..... మా యూనిట్ రెండురోజుల్లో ఫ్రంట్‌కి బయలుదేరాలని ఆర్డర్సు వచ్చాయి.... ఎల్లుండి స్పెషల్ ట్రైన్ బయలు దేరుతుంది.....

చెప్తున్న శ్రీధర్ హఠాత్తుగా విజయ

ముఖంచూసి ఆగిపోయాడు. విజయ చేతిలోని పౌడరు పఫ్ జారి పోయింది. విభ్రాంతపోయినట్లు చూస్తున్న విజయ భుజంమీద చెయ్యివేసి కదిపాడు శ్రీధర్.

"మీరు.... మీరూ వెళ్ళాలా?" అదో లోకం లోంచి లాగా వెర్రిగా చూస్తూ అడిగింది.

"ఏమిటా వెర్రి ప్రశ్న, విజ్జీ, ఆర్మీ ఆఫీసరు భార్యవయుండీ..."

"వారం రోజులనించి, పేపరు, రేడియో వార్తలు వింటూ నేను దిగులు పడుతూనే ఉన్నాను,.... చివరికి అనుకున్నంతా....." ఆమె గొంతు తడబడింది.

"నీకేమైనా పిచ్చా ఏమిటి, ఇందులో యింత దిగులు, బాధ, ఆశ్చర్యం ఏముంది చెప్పు. యిన్నాళ్లు యీ యూనిఫారం ధరించింది, అవసరం వచ్చినపుడు దేశానికి ఉపయోగపడాలనేగా! యిలా దేశంకోసం పిలవ బడ్డందుకు నిజంగా గర్వపడాలి, యీనాటికి దేశానికి నేనూ ఏకొద్దిగా నైనా సేవచేయగలుగుతున్నానని గర్వి స్తున్నాను!......"

"భారతమాత, దేశసేవ, దేశరక్షణ.... ఆమాటలన్నీ నాకూవచ్చు, అయినా ఏమిటో మీరు వెళ్ళాల్సిరాదను కున్నాను, రాకూడదని దేవుడిని ప్రార్థించాను....." కళ్లలో తిరుగుతున్న నీరు దాచుకోడానికి శ్రీధర్ గుండెల్లో మొగందాచుకుంది.

"ఏమిటిది, పిల్లీ! ఎందు కంత బెంగ చెప్పు! ఏమయింది యిప్పుడు? అంత బాధపడడానికి, వెళ్లినవారందరూ చని పోతారా? ప్రతివాడికీ తల్లి, దండ్రి, భార్య, పిల్లలు ఉండనే వుంటారు! ఎవరి క్షేమం వాళ్ళు చూసుకుంటే యింక దేశం గతేంకాను!" లాలనగా అంటూ విజయ తలనిమిరాడు.

"ఎల్లుండే వెళ్ళాలా? యింతత్వరగా!" తడి కళ్లతో భారంగా అడిగింది.

"యిది మరీ బాగుంది,! 'మా శ్రీమతి యిప్పుడప్పుడే వెళ్లద్దంది, నాలుగు రోజులు ఆగు, తర్వాత యుద్ధంచేద్దాం' అంటే అయూబ్ ఖాన్ ఆగుతాడేమిటి?"

"మీరలా హాస్యంగా మాట్లాడకండి! దేనికైన మితి వుంటుంది!" రోషంగా చూసింది విజయ.

"నీబాధ నాకర్థమవుతుంది, డార్లింగ్. నీకన్నా ఎక్కువ భాధ నాదంటె నమ్మ వేమో! నిన్నిలా, యింత త్వరలో యీ పసి వాళ్ళను విడిచివెళ్లడం అంటే నాకేం సర్దాగా వుంటుందా చెప్పు!"

"ఎలా వుంటాను?.... ఎన్నాళ్ళు? ఏమిటో అంతా భయంగాఉంది"

"ఏమిటి విజయా, నేనంత బాధ్యతా రహితంగా నిన్ను, పిల్లలని ఉన్నపాటున వదిలి వెళ్లిపోతాననుకున్నావా? ఆఫీసునుంచే మీనాన్నగారికి వైరిచ్చాను, బహుశా నే వెళ్లే లోపలే ఆయనవచ్చి తీసుకు వెడ తారు·....·."

విజయకేం చెప్పాలో, ఎలా చెప్పాలో అంతుచిక్కలేదు.

ఆడుకుంటున్న నాలుగేళ్ల బేబి పరి గెత్తుకువచ్చాడు—" డాడీ, డాడీ, రాము అంటున్నాడు, మీరు యుద్ధానికి వెళ్తారుట! నేను వచ్చి అందరిని యిలా ఢాం ఢాం అంటూ చంపేస్తాను!" టాయ్ పిస్తోలుతో ముద్దు ముద్దుగా అన్న కొడుకు మాటలకి మురిసిపోయాడు శ్రీధర్.

" షెబాష్! నేను ముందు వెళ్లి వాళ్ళందరిని పట్టుకుని చెట్టుకు కట్టేసి ఉంచుతాను. అప్పుడు నువ్వొచ్చి వాళ్ళని కాల్చేద్దుగాని అంతదాక అమ్మదగ్గర వుండి, బుద్ధిగా అమ్మచెప్పినట్టువింటే వచ్చేటప్పుడు బోలెడు బొమ్మలు, చాక లెట్లు తెస్తాను, ఏం?" బాబుని ఎత్తుకుని ముద్దుపెట్టుకుంటూ అన్నాడు.

"వాణ్ణిదించండి. బట్టలు పాడవు తాయి!" విజయ అంది.

"వాడేంచేసినా, యీవాళా రేపేగా, ఉండనియ్యి, ఫరవాలేదు"

విజయకామాటలు బాణాల్లాగ తగి లాయి. గిరుక్కున వెనక్కిదిరిగి గది లోంచి వెళ్లిపోయింది. బట్టలు మార్చుకుని కాఫీకప్పు అందుకుంటూ విజయముఖం లోకి చూశాడు శ్రీధర్.

"అలాఉన్నావేం విజ్జీ, యింతలోనే ఏమయింది?...... యీ రెండు రోజు లయినా కాస్త సర్దాగావుందాం. ఆతర్వాత ఏమవుతుందో, మళ్లా ఎప్పటికో"

విజయ చప్పున శ్రీధర్ నోరుమూసి చురుకుగా చూసింది. "ఎందుకలాంటి మాటలు అంటారు!.....అసలే నామనసు బాగులేదు!"

"పిల్లి విజ్జీ.... యింతలోనే నాకేదో అయిపోయినట్టు బాధపడతావేం, నాకేం అవదు, నిక్షేపంలా తిరిగివస్తాను...... ఎవడికైన సరే, చావన్నది ఒక్కసారే వస్తుంది. అది రావాల్సినపుడు యింట్లో పడుకున్నా రాకమానదు!"

"చాల్లెండి! ఆమాత్రం వేదాంతం నాకూవచ్చు"

"అయితే ఇంకెందుకు విచారం! పద అలా సర్దాగా తిరిగివద్దాం"

ఆ రాత్రి పదిగంటలవరకు, పిచ్చెత్తి నట్టుగా భార్యా పిల్లల్ని కార్లో వూరంతా తిప్పాడు. బట్టలు, బొమ్మలు, పుస్తకాలు, బిస్కట్లు...... విజయ వారిస్తున్నా విన కుండా కనిపించినవన్నీ ఏవేవోకొన్నాడు. "ఇంక యిదే ఆఖరిసారేమో" అన్న ఎరుక యిద్దర్నీ వేధిస్తోంది. యింటికి తిరిగి వచ్చాక బయటికి వెలిబుచ్చలేని వేదనతో విజయ నిర్లిప్తంగా చూస్తూంటే, తనే స్వయంగా బాబికి,బేబికి తినిపించి కథలుచెప్పి నిద్రపోగొట్టాడు.

ఏక్టివ్ సర్వీసుతో పాల్గొనడం శ్రీధర్ కిదే మొదటిసారి. చైనా దురాక్రమణ జరిగినపుడు అతను దూరంగా వుండి పోయాడు. అప్పుడోవిధంగా ఏదో అవ కాశం చేయిజారి పోయినట్టుగా నిరు త్సాహపడ్డాడు. యీ నాటికి దేశంకోసం వినియోగ పడుతున్నానన్న ఆవేశం, క్రొత్త ఉత్సాహాన్ని కలిగిస్తోంది.

కాని విజయని చూస్తుంటే, ఆమె పడే ఆరాటం తల్చుకుంటే— అసలతను సైన్యంలో జేరడం పొరపాటనిపిస్తూంది. తనయెడ ఆమె ప్రేమాభిమానాలు అత నికి తెలుసు. తనకేమైనా అయితే ఆమె ఏమవుతుందో!— ఆ ఆలోచన భరించలేక పోయాడు శ్రీధర్. పిల్లలు బొత్తిగా పసివాళ్ళు! తనకెన్నో బాధ్యతలున్నాయి! వీటన్నిటిని మించింది ఉద్యోగ బాధ్యత! దేశంకోసం తనకర్తవ్యం!

అతని మనసు రకరకాల అనుభూతులు మధ్య నలిగిపోసాగింది. తుఫాను నాటి సముద్రంలా అలజడి రేగడమే కాని నివృత్తి అంటూ కనపడదు. తను చెయ్యాల్సింది, చేయగలిగింది ఒక్కటే. దేశంకోసం సైన్యంలో చేరిననాడు చేసిన ప్రమాణం, తనప్రాణాలకి, స్వప్రయోజనాలకి లెక్క చేయకుండా విధి నిర్వర్తిస్తానన్నదొక్కటే అతనికి బాట చూపింది.

అనుకొన్నరోజు వచ్చింది. శ్రీధర్, విజయ పిల్లలతో స్టేషనుకి బయలుదేరే వరికి ప్లాట్‌ఫాం అంతా కోలాహలంగావుంది. యూనిఫారాల్లో ఆఫీసర్లు, జవాన్లు అటు యిటు తిరుగుతున్నారు. వాళ్ల నడకలో, మాటల్లో ఒకహుందా, విశ్వాసం ఒక ఉన్నత లక్ష్యానికి కట్టుబడ్డామన్న గర్వం, అటో ఇటో నన్న నిర్లక్ష్యంతో కూడిన సాహసం కనబడుతున్నాయి. వాళ్లని సాగనంపడానికి వచ్చిన తల్లి తండ్రులు, భార్యాబిడ్డలే కాకుండా, యింకా వూర్లో ఎందరో జనంతో ప్లాట్ ఫాం అంతా కిట కిట లాడుతూంది. "భారత్ జిందాబాద్", భారత్‌కే బహదూర్ జవాన్ జిందాబాద్", "ఇండియన్ ఆర్మీ జీతేగా!" లాంటి రకరకాల నినాదాలు మిన్ను ముట్టుతున్నాయి. కొంతమంది పూల గుత్తులు, ఎర్ర గులాబులు ఆఫీసర్లకి, జవాన్లకి అందించారు. మరి కొందరు బుట్టల కొద్ది పూలరేకులు జవాన్లు కూర్చున్న బోగీల నిండా విరజిమ్మారు. కొందరు స్త్రీలు ఆఫీసర్ల నుదుట తిలకం దిద్ది హారతులిచ్చారు. వూర్లో పెద్దమనుష్యులు కోరిక, పట్టుదల కలిసిన గంభీర కంఠాలతో ఆఫీసర్లతో చేతులు కలిపి 'విష్‌యూ సక్సెస్' అంటూ అభినందించారు. ప్రజల ఆదరాభిమానాలు, ఆప్యాయత, తమలో వారుంచిన నమ్మకం చూసిన ప్రతీ సైనికునికి, యిలాంటి దేశంకోసం, యిలాంటి ప్రజల రక్షణ కోసం ఏం త్యాగం చేసినా చాలదనిపించింది.

మేజర్ శ్రీధర్ తనకు నిర్ణయించిన కంపార్ట్మెంటులో సామాను పెట్టించి, బయట నిలబడి విజయకు ధైర్యం చెపుతూ పిల్లలిద్దరినీ ఎత్తుకు ముద్దులాడాడు. తడిగా ఉన్న విజయ కళ్లలోకి ఒకసారిచూసి మృదువుగా, సోదార్పుగా విజయ భుజంమీద తట్టాడు. ట్రైను కదలడానికి యింకా కొన్ని నిమిషాలు వ్యవధి ఉంది—

ఆనాటి ఉదయం అంతా విజయకి వూపిరి సలపని పని. శ్రీధర్‌కి యిష్టమైన వంటలు చేసింది. కొన్ని ఫలహారాలు పాక్ చేసింది. వెళ్లేముందు శ్రీధర్ నుదట తిలకం దిద్ది, హారతి యిస్తుంటే శ్రీధర్ నవ్వి వేళాకోళం చేశాడు. "ఓహోహో!. ఆనాటి మాంచాల, బాలచంద్రుడు గుర్తు వస్తున్నారు. వీర నారిమణి, నేనేం మహారాజును అను కుంటున్నావా? హారతులిస్తున్నావు. అయినా ఇంకా ఈ అణుయుగంలో కూడ ఈ పిచ్చి ఏమిటి విజయా?"

"ఏయుగమైనా మన సాంప్రదాయాలని పాటించాలి. .... యీ రోజు నేనేం చేసినా మీరు భరించి వూరుకోవాలి. అలా వేళాకోళం చేయకండి" విజయ కంఠం వణికింది.

ఆమె కళ్లలో భక్తి, తన యెడల ప్రేమానురాగాలు తలపుకి రాగానే రెండు చేతులు చాచి గాఢంగా హత్తుకుని "విజీ యీ నీ ప్రేమానురాగాలే నాకు శ్రీరామ రక్ష. నీకోసమైనా తప్పక తిరిగివస్తాను. చివరి క్షణం వరకు దేముడితో పోరాడి, ఎలాగయినా నీచేతుల్లో వాల్తాను—" ఉద్రేకంగా అన్నాడు శ్రీధర్.

"వెళ్లిరండి, ..... విజయులై తిరిగి రండి ....... అందుకోసమే అనుక్షణం మీరొచ్చేవరకు భగవంతుడిని ప్రార్థిస్తూ వుంటాను" విజయ కళ్ల నీటిపొరల వెనుక తళ తళ మెరిశాయి—

రైలు కూసింది. గార్డు జండా వూపాడు. అందరు గబగబ ఎవరివారి దగ్గర వారు సెలవుతీసుకుని భారంగా కదిలారు. మళ్లీ ప్రజలు పువ్వులు వెదజల్లారు. "భారత్‌కే బహదూర్ జవాన్ జిందాబాద్", "ఇండియన్ ఆర్మీ జిందాబాద్", 'జైహింద్'- కొన్ని వందల గొంతుకల నినాదాలతో, పూలవర్షం కురుస్తుండగా, కొన్ని వందల చేతులు ఉత్సాహంగా చేతులు వూపుతుండగా రైలుకదిలింది శ్రీధర్ పిల్లలకి టా టా చెప్పి, విజయ చేయి మృదువుగానొక్కి రైలు ఎక్కాడు. అలా చెయ్యి వూపుతూ, రైలు కనుమరుగయేవరకు నిశ్చేష్టిత అయి ఉండిపోయింది విజయ.

"చల్ బహన్, అవుర్ క్యాహై దేఖ్‌నేకో, అబ్, ఘర్ చలే" మిసెస్ బెనర్జీ, యింకో మేజర్ భార్య, కళ్లువత్తుకుంటూ విజయ భుజంమీద చెయ్యి వేసింది. విజయ ఉలిక్కిపడి వెనక్కిచూసి నిట్టూర్చి, పిల్లల్ని తీసుకుని యింటికి బయల్దేరింది.

* * *

"టెలిగ్రాం!"

వీధి వరండాలో వాలు కుర్చీలో పడుకుని, దూరంగాచూస్తూ ఏదో ఆలోచిస్తున్న విజయ ఉలిక్కిపడింది. తడబడూ లేచి, వణుకుతున్న చేతులతో సంతకం చేసి ఆత్రుతగా విప్పింది.

"నాన్నా!, అమ్మా!" సంతోషంతో ఒక్క వెర్రికేక పెట్టి లోపలికి పరుగెత్తింది.

"ఏమిటమ్మా, ఏమయింది?" కూతురి గాభరాచూసి ఆత్రుతగా అడిగారు రావుగారు.


"ఆయన...... ఆయన"

"ఏమైంది?"

"అదికాదు నాన్నా, ఆయన వస్తున్నారు రేపు యిదిగో టెలిగ్రాం!" అందించింది ఉత్సాహంగా.

"— ఎర్రైవింగ్ టుమారో మెయిల్— శ్రీధర్" కళ్లజోడు తీసి తుడుచుకున్నారు రావుగారు. ఆనందంతో ఆయన మొగం తబ్బిబ్బైంది.

"ఏమేవ్, ... అల్లుడు క్షేమంగా ఉన్నాడే! రేపు వస్తున్నట్టు టెలిగ్రాం వచ్చింది."



అప్పుడే వచ్చి, సంగతి తెలియక కూతురి వంక అయోమయంగా చూస్తున్న పార్వతమ్మగారు యీ మాటవిని సంతోషం పట్టలేకపోయి.—

"నిజమే!......నిజంగానా!.... అమ్మయ్య ప్రాణం కుదుట పడింది యిన్నాళ్ళకి! ఆ కబురు విన్నదగ్గర్నించి దాని బాధ చూడలేకపోతున్నాను. కంటికి నిద్రలేదు. తిండిలేదు. బెంగతో చిక్కి శల్యమైంది తల్లి" చెంగుతో కళ్ళు వత్తుకుంటూ అంది.

"నీ వదృష్టవంతురాలివమ్మా విజయా, నీ ప్రార్థన భగవంతుడు విన్నాడు..... వెళ్ళుతల్లీ వెళ్ళు. యింక అతనికి గదీ అదీ సర్దించు. పది రోజులనించి ఏడ్చిన దానివి ఏడ్చినట్టే ఉన్నావు" కూతురి వంక ఆప్యాయంగా చూస్తూ అన్నారు రావుగారు.

విజయ మనసులో అంతు తెలియని ఆనందం, ఏవేవో ఆలోచనలు తెచ్చిన సిగ్గు, ఏం చేయాలో తోచని సంభ్రమం పురివిప్పుకున్నాయి.

మేజర్ శ్రీధర్ ఫ్రంట్‌కివెళ్ళిన పదిహేను రోజుల్లో మూడు ఉత్తరాలు రాశాడు. అన్నింటిలోనూ ఒకేమాదిరి వాక్యాలు. 'నేను క్షేమంగా ఉన్నాను. నా గురించే బెంగావద్దు.' అతనిగురించి ఇంకేమీ— ఎక్కడున్నది, ఏం చేసింది— వివరాలు వ్రాసేవాడు కాదు. భర్త క్షేమంగా ఉన్నందుకు విజయ వెయ్యి దేముళ్ళకు మొక్కుకుంది. ఉత్తరం కొద్ది ఆలస్యం అయితే మనసు పరి పరి విధాలపోయేది. తోటి ఆఫీసర్ల భార్యలు రాసే వార్తలు, పేపర్లలో, రేడియోలోవార్తలు వర్ణమకుంటూనే తెలుసుకునేది.

మేజర్ నవాబ్ శరీరం షెల్లింగ్‌లో తుత్తునియలయిపోయింది. కెప్టెన్ రాథరి స్ట్రాఫింగ్‌లో బంకర్లోనే ప్రాణాలు విడిచాడు! లెఫ్టినెంట్ కర్నల్ సభర్వాల్ శరీరంనిండా బులెట్లవర్షం కురిసింది! లెఫ్టినెంట్ అర్జున్‌సింగ్ మైన్‌మీద అడుగు పెట్టగానే కాలు ఎగిరిపోయింది.

యిన్ని ఘోరవార్తలు! ప్రతిరోజు యిలాంటి వార్తలన్నీ వింటున్న మనసు భయాందోళనతో కంపించేది! ప్రతి రోజూ, ప్రతిక్షణం యిలాంటి వార్త వినవలసివస్తుందేమోనన్న భయంతో గడిపేది విజయ. ఆఖరికి విజయ భయపడినట్టే జరిగింది—ఒకరోజు ఆర్మీ హెడ్‌క్వార్టర్సునించి ఉత్తరం— "రిగ్రెట్ టు ఇన్‌ఫాం యు, మేజర్ శ్రీధర్ మిస్సింగ్. ." అన్న వార్త మోసుకొచ్చింది.

అది చదివిన విజయ కొన్ని నిమిషాలు చైతన్యమే కోల్పోయింది. ఏమయిందో? ఎక్కడున్నారో, ఎలా ఉన్నారో? ఎక్కడ ఏ గుండు దెబ్బతినీ, ఎవరికంటా పడని చోట పడిపోయారేమో! గాయాలు, ఆకలి, దాహం అన్నీ భరిస్తూ ఎన్నాళ్ళుంటారో! ఎవరన్నా చూసి చేరదీస్తారో! లేక పాకిస్థానీల చేతుల్లో పట్టుబడ్డారో! వాళ్ళు ఆయన్ని ఎలా చూస్తారో! వాళ్ళ ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలని చూస్తారు. రక్షణ రహస్యాలు చెప్పమంటారు, లేకపోతే దేశద్రోహకరమైన ప్రకటనలు చేయమంటారు. చేసిందాకా చిత్రహింస పెడతారు. అవన్నీ వూహిస్తూ విజయ రంపపుకోత అనుభవించేది. ఎవరెన్ని విధాల నచ్చచెప్పి చూసినా, ఆమె మనసు చెదువంకే మొగ్గేది. ఆమెబాధ చూడలేక రావుగారు స్వయంగా ఆర్మీ హెడ్‌క్వార్టర్సుకి వెళ్ళి పై అధికారులని కలుసుకుని మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది. "అతను చనిపోయిన వారి లిస్టులో లేడని, ఒకవేళ ఎవరికీ కంట బడనిచోట పడిపోతే పడివుండ వచ్చని, లేకపోతే యుద్ధఖైదీగా పట్టుబడి వుండ వచ్చని, యుద్ధమాగింది కనక రెడ్‌క్రాస్ సంస్థ ఖైదీల లిస్టు అడిగిందని, ఖైదీ లని విడిచిపెడితేగాని తామేది నిర్ణయించి చెప్పలేమని' అధికారులు చెప్పిన మాటలు విజయకి అప్పగించారు రావుగారు.

దేముని మీద భారంవేసి ఆ రోజు కోసం చూడడం మినహా ఎవరూ ఏం చేయగలరు? ఆశ, నిరాశల మధ్య నలిగిపోతూ భారంగా రోజులు గడుపుతున్న విజయ, అలాంటి సమయంలో శ్రీధర్‌నించి వచ్చిన టెలిగ్రాం చూశాక విజయ ఆనందానికి హద్దులేక పోయింది. ఎన్నాళ్ళకో విజయ మొగంమీద మళ్ళీ నవ్వు తొంగిచూచింది.

ఆ సంతోషపు ఉప్పెన తగ్గగానే విజయలో క్రొత్త అనుమానం తొంగి చూసింది! యింత తొందరగా ఎలారా గలుగు తున్నారు? యుద్ధమాగిన అన్ని స్థావరాలలోనూ సైన్యాలు వున్నారు, యీయన ముందుగా ఎలా రాగలుగు తున్నారు? ఆ అనుమానం రాగానే విజయ భయంతో కంపించింది. ఆయనకి ఏమైనా జరిగిందా? ఏ అంగ వైకల్యమైనా జరిగి బాధ్యత నిర్వహించలేకుండా అయ్యారా? అంచేతే పంపించేస్తున్నారా? విజయ వ్యర్థ అనుమానాలకి, కుశంకలకి తల్లి దండ్రులు కేకలేశారు. అనవసరమైన అనుమానాలతో అశుభం మాట్లాడవద్దని వారించి, ఏం జరిగి వుండదు, క్షేమంగా వుంటారని ఎంతధైర్యం చెపుతున్నా, ఆ అనుమానం విజయ మనసుని పట్టి పీడించ సాగింది. తనకు తానే నచ్చచెప్పుకుంటూ, రాత్రంతా కలతపడ్డ మనసుతో, ఒక ప్రక్క సంతోషం, యింకో ప్రక్కవిచారం వేధిస్తూంటే, ఆలోచనల్తో నిద్రపట్టక ఎప్పుడో తెల్లవారు జామున కన్నుమూసింది.—

మర్నాడు ఆత్రుతగా శ్రీధర్ కోసం నిరీక్షిస్తూ, పోర్టికోలో కూర్చున్న విజయకి ఎంతకీ కాలమే గడవనట్లనిపించింది. స్టేషనికి వెడతానంటే ఇంటి దగ్గరుండి, రాగానే దిష్టితీసి, హారతి యీయాలని వుండిపొమ్మన్న తల్లిమాట ప్రకారం విసుక్కుంటూ, ఉత్సుకతతో ఎదురు చూడసాగింది. శ్రీధర్‌కి యిష్టమైన వంటలు స్వయంగాచేసి, అన్ని పదుపాయాలు అమర్చి, పిల్లల్ని ముస్తాబు చేసి, తను అందంగా అలంకరించుకుని, ఆరాటం, ఆందోళన నిండిన మనసుతో ఎదురు చూడ సాగింది.

కారు హారన్ విని గాభరగా లేచి నుంచుంది. పోర్టికోలో కారు ఆగగానే తండ్రి ముందు దిగి, వెనక తలుపు తీసి పట్టుకున్నారు. శ్రీధర్ కంటె ముందుగా కారులోంచి దర్శన మిచ్చిన స్ట్రెచర్స్ చూసి విజయ మనసు భయంతో కంపించింది. స్ట్రెచర్ సహాయంతో, తండ్రి అందించిన చేయి అందుకుని కారుదిగిన శ్రీధర్‌ని చూసి కెవ్వుమని కేకవేసి కూలి పోయింది విజయ.

శ్రీధర్‌కి ఒక కన్నులేదు. ఆ స్థానాన్ని పెద్దలొత్త ఏర్పడింది. నుదుటి నించి చెంపదాకా పెద్దమచ్చ, యింకా పూర్తిగా మానని ఎర్రమచ్చ మొగాన్ని వికృతం చేసింది. కుడిచేయి మోచేతివరకు, కుడి కాలు తొడవరకు తెగింది. పెరిగిన గడ్డంతో, నీరసించిన మొహంతో, భయంకరంగా ఉన్నాడు.

కళ్ళు తెరచిన విజయ, తన తల శ్రీధర్ ఒడిలో వుండడం చూసి, భయంతో దిగ్గునలేచి కూర్చుంది. నీరసంగా వున్న శ్రీధర్ కళ్ళలో చిన్న నవ్వుమెరిసింది. "భయపడుతున్నావా విజ్జీ! మొగం చాల మారిపోయింది కదూ" బాధగా అన్నాడు. విజయ మొగం చేతుల్లో కప్పుకుని విశట్టంగా రోదించ సాగింది.

"ఏడవకు విజయా, యిటుచూడు..." నెమ్మదిగా ఏడంచేత్తో ఆమె మొగాన్ని చేతులు తీయబోయాడు. అతని స్పర్శ తగలగానే, ఉలిక్కిపడి, మొహంమీంచి చేతులు తీసి, శ్రీధర్ చేతుల్నించి తప్పించుకోడానికి ప్రయత్నించింది. ఆమె కళ్ళలో ఆందోళన, ఆవేదనకంటె జుగుప్స స్పష్టంగా కనిపించింది శ్రీధర్‌కి. అతని మొగం వెల్లబడింది. దెబ్బతిన్నవాడిలా చూశాడు.

"నేను చాల అసహ్యంగా ఉన్నాను కదూ!" బాధగా అన్నాడు చెయ్యి వెనక్కి తీసుకుంటూ.

అప్పటికి విజయ నోరు పెగలలేదు. ఏమో చెప్పాలన్నట్టు పెదాలు వణికాయి. చూపులు అతన్నించి తప్పుకున్నాయి. తల్లి ప్రక్కనే నుంచుని భయంగా చూస్తున్న కొడుకుని చూసి ఆప్యాయంగా చేతులు చాచాడు. "రా, బాబూ!" అంటూ చేయి పట్టుకోగానే గింజుకుని చేయి లాక్కుంటూ "ఛీ... నన్ను ముట్టుకోవద్దు.... అమ్మా బూచి"...అంటూ తల్లి వెనక దాక్కున్నాడు. విజయ చప్పున బాబుని ఎత్తుకుని గుండెల కదుముకుంటూ "తప్పమ్మా, నాన్న" అంటూనే ఏడవసాగింది. శ్రీధర్ గుండె చెయ్యి రంపంతో కోసినట్టయింది. దుఃఖం, విషాదం మూర్తీభవించినట్టున్న ఆమెరూపం ఆ మవునం శ్రీధర్‌కి ఎన్నో అర్థాలుచెప్పింది.

"మేము ప్రాణాలకి లెక్క చెయ్యకుండా పోరాడాము. కాని భగవంతుడిలా చేశాడు. యిలా మీకందరికీ సహించలేని వికృత రూపంతో నీకు బరువుగా తయారవుతానని కలలోకూడ అనుకోలేదు!"


"ఛా...ఏమిటా మాటలు! నాకు బరువు గావడమేమిటి?" యింతసేపటికి వినవచ్చిన ఆమె మాటలు చాలా పేలవంగా, అసంతృప్తిగా వినబడ్డాయి శ్రీధర్‌కి

"నా కర్మమవుతూంది విజయా. ఇలాంటి బ్రతుకు బ్రతికిరావడంకంటె చావునయం"

"ఎందుకలా మాట్లాడుతారు?" అతని నోరు మూసింది విజయ కోపంగాచూస్తూ.

"నన్ను చెప్పనియ్యి. యీ రూపంతో, యీ పరిస్థితుల్లో నాకు కావల్సింది జాలి, సానుభూతికాదు. కాని నా క్కావలసింది అదికాదు విజయా! నాక్కావలసింది నాకు దొరకదు. యిదివరకటి ప్రేమాభిమానాలు ఇప్పుడింక తల్చుకుని మురవాల్సిందే.... విజయా, నేనే మాసించివచ్చావో నీకు తెలియదు.....నా వూహలు తారుమారయ్యాయి.

"మీ రపార్థం చేసుకుంటున్నారు... నే ననేది మీ రర్థం చేసుకోకుండా అపోహ పడుతున్నారు.....ఒక్కసారిగా, హఠాత్తుగా



మీతో మార్పు చూసిన వివరి గుండె అయినా ముక్కలవుతుంది.....అవన్నీ కూడ దీసుకుని మళ్లీ మామూలు మనిషి కావ డానికి ఎంతకాలం పడ్తుందో వూహించండి. నేను మాటల్లో నా ప్రేమాభిమానాలు




వ్యక్తం చేయలేక పోయానంటే, నా అశ క్తత నర్థం చేసుకోండి....."

"ఏమిటి నీ అశక్తత? భర్త విధి నిర్వ హణలో, అవిటివాడు, కురూపి అయి తిరిగి వస్తే...ఇదా ఆదరించే విధానం........ కాస్త తియ్యగా మాట్లాడడానికైనా అశ క్తతా? విజయా, యుద్ధానికి వెళ్లేముందు నాయెడ నీ ప్రేమాభిమానాలు ఎలాంటివో నాకు తెలుసు. యీరోజు నాకు నీ ప్రేమాభి మానాలు యిదివరకటికన్నా ఎక్కువ అవ సరం—విజయా, నీకు తెలీదు....నే నెలా మృత్యుముఖంనించి తప్పించుకుని వచ్చానో, ఎవరికోసం వచ్చానో నీకు తెలీదు....నేను నీనించి ఏమాశించివచ్చానో నీకు తెలి యదు.....అబ్బ.....విజయా, నీ విలా మారి పోతావని వూహించగలిగితే....." ఆవేశంగా అన్నాడు శ్రీధర్.


విజయ చెంపల్ని కన్నీళ్లు ధారలు కట్టాయి. ఆమె ఏదో చెప్పబోయే లోపలే అతను జాలిగా మొదలుపెట్టాడు...

—"ఆ రాత్రి మా బెటాలియన్ ఒక హిల్ ఫీచర్ పట్టుకోడానికి పన్నద్ధమైంది. నేను ఒక ఫ్లాంక్‌ని కమాండ్ చేస్తున్నాను. కొండ దిగువ మేంచేరేసరికి, పైనించి గుండ్లవర్షం గురిసింది. మేమంతా రాళ్లు, గుట్టలు చాటున పొజిషన్ తీసుకున్నాం. కొద్దిసేపటికి ఫైరింగ్ తగ్గింది. మేమంతా మెల్లిగా పైకి పాకడం మొదలుపెట్టాం. యీ చేతులు, కాళ్లు, ఆ రాళ్లు, ముళ్ల మొక్కలు మీదపాకి రక్తం చిందాయి. అలా రెండు మూడు వందల అడుగులదూరం కొండపైకి ఎగబాకడం ఎంత అలసటో వూహించాలి. ఇంతలో ఎటాక్‌కి ఆర్డర్సు వచ్చాయి. మేమంతా ఒక్కుమ్మడిగా శత్రు స్థావరాలమీదకి విరుచుకుపడ్డాం. యింకో ముప్పై గజాలదూరంలో ఉన్నామనగా ఎదు రుగా బ్రెంచి లోంచి ఎవరో గ్రెనేడ్ విసి రాడు. నేను వేల కొరిగాను. ఆ హడావిడిలో యీ కాలు ఒక మైన్‌మీదపడి ఎగిరి పోయింది. అదృష్టవశాత్తు గ్రెనేడ్ క్రిందికి దొర్లి కొంతదూరం పోయాక ప్రేలింది. ఆ చెణుకులు కంటికి తగిలి భగ్గుమంది... భరించలేని బాధతో తెలివి తప్పిపోయింది. ఆ తర్వాత నాకేమయిందో!...ఆ ఎటాక్‌లో విజయం వివరిదీకాదు. వాళ్లు ఖాళీ చేసి వెనక్కి తగ్గారుగాని, మావైపుకూడ ప్రాణనష్టం ఎక్కువైంది. ఒకవేళ వాళ్లు ఎటాక్ చేస్తే మేం పట్టుకోడం కష్టం. అందుకని వెనక్కి తగ్గాల్సి వచ్చిందట. ఆ చీకట్లో ఎవరెక్కడ ఉన్నారో, ఎవరు బ్రతికారో, చచ్చారో తెలిసి సంరంభంలో వన్నక్కడే వదిలారు.....తెల్లవారాక శత్రువుల

కాలివేళ్ల మధ్య ఒరుపుడు
పుళ్ళు మడమ పగుళ్ళు
చర్మంలో సహజంగా వుండే
చమురులు లోపించటంవల్ల
కలుగుచున్నవి.

కాలివేళ్ళ మధ్య ఒరుపుడు పుళ్ళు. మడమ పగుళ్ళు లిచెన్‌సా వల్ల నయం కాగలవు: ఏమంటే, లిచెన్‌సా చర్మానికి పోషణ ఇస్తుంది. త్వరితగతిని దీర్ఘకాలం నిలిచియుండేట్లు గుణమిస్తుంది.




చర్మ రుగ్మతలు లిచెన్‌సాకు శీఘ్రంగా లొంగుతవి
(నేడే ఒక ట్యూబువాడి చూడండి)
DZ 1613 TG

పెట్రోలు పార్టీ ఒకటి నన్ను పట్టుకున్నారుట. అంచేత నన్ను మిస్సింగ్ లిస్టులో చేర్చారుట. తెలివి వచ్చాక, చెయ్యి, కాలు, కన్నులేని నాకు, మొగం అంతాగాయాలతో మచ్చలతో వికృతమైన నాకు....మొట్టమొదటగా గుర్తు వచ్చింది నువ్వు!..... విజయ......నా విజయ ఇప్పుడు నన్ను చూస్తే ఎంత బాధ పడుతుంది అనుకున్నాను. నిన్ను, నా యెడ నీ ప్రేమాభిమానాలు తల్చుకుంటూ, మళ్లీ యీవిధంగానైనా నీ కంటబడ్తే నువ్వు వెలిబుచ్చే ఆనందం, ప్రేమ తల్చుకుంటూ నా బాధని మరచేవాడిని....ఆ సమయంలో నీ ప్రేమ ఒక్కటే వోదార్పు! మొత్తానికి శరీరం ముక్కలు ముక్కలై, సగం రక్తం కోల్పోయి నేను చావునించి బయటబడ్డాను. చావు ముఖం నించి ఎంతసూక్ష్మంగా తప్పించుకోగలిగానో అర్థం అవుతూందా? ఎలా బ్రతికానో నాకే తెలియదు. శారీరక బాధకంటె పాకిస్థాన్ చేతుల్లో బందీనవడం నన్ను ఎక్కువ కృంగదీసింది. ఆ నరకంనించి ఎప్పుడు విముక్తుడనై నీ చెంత వ్రాలుతానా అని రోజులు లెక్కపెట్టుకునేవాడిని....విజయా, నే నెన్ని ఆశలతో, ప్రాణాలతో బయటపడి నీ దగ్గిరకు వచ్చానో నీ వూహించలేవు. నువ్వుండగా నాకు కాలు, చేయి లేకపోతేనేం అనుకున్నాను. 'యీవిధంగానైనా బ్రతికి బయటపడ్డారు, నా అదృష్టంవల్ల. అంతే చాలు'నని అంటావని, మానసికంగా, శారీరకంగా కృంగిపోతున్న నన్ను నీ ప్రేమాభిమానాలతో సేద తీరుస్తావని ఆశించాను. కాని నన్ను చూడగానే నీ మొగంలో కనపడ్డ జుగుప్స, నీ మౌనం, నీ మాటలు.....విజ్జీ!... యిప్పుడనిపిస్తూంది .... ఎందుకు బ్రతికానని!.....యీ ప్రాణాలమీద యింత ఏవగింపు నా కెన్నడూ కలుగలేదు.....విజయా నే నాశించిన ఆదరణ, ఆప్యాయతలు మొదటి రోజునే నీదగ్గిర కనపడనపుడు, జీవచ్ఛవంలా గడుపుతూ, బ్రతుకంతా నీకు భారంగా ఉండటం నా కిష్టంలేదు ...అలాంటి నిక్కృష్టపు బ్రతుకు నా కవసరమూలేదు..... కానీలే.....యిప్పటికి మించిపోయిందీలేదు!.... ప్రాణాలతో ఆటలాడడం నేర్చిన నాకు కావాలనుకున్నప్పుడు యివి తీసుకోడం పెద్ద పనికాదు!.....కాని ఒక్కటే నన్ను బాధిస్తోంది. యీ మృత్యువు యుద్ధరంగంలో వచ్చివుంటే, కనీసం దేశంకోసం చనిపోయానన్న తృప్తైనా మిగిలేది.....యింత అవమానాన్ని ఎదుర్కొనడమైనా తప్పేది!.... విజయా, నీవు పిల్లలు సుఖంగా ఉండాలని కోరుతూన్నాను''......

విజయ ఏదో చెప్పాలని నోరు తెరిచేలోపలే, ఆమె చెవుల్లో పిస్టల్ పేలిన చప్పుడు వినిపించింది. ఎదురుగా రక్తం ముద్ద!

కెవ్వున కేకవేసింది విజయ.

''అమ్మా!''.... బేబి గట్టిగా ఏడుస్తూంది. ఉలిక్కిపడి లేచి కూర్చుని, చుట్టూ అయోమయంగా, భయంగా చూసింది విజయ.

''విజయా.....విజయా! ఏమిటంతలా నిద్రపోతున్నావు? బేబి యిందాకటినించి ఏడుస్తూంది.....లే'' తల్లి ప్రక్క గది నించి వచ్చింది.

''ఏమిటో పీడకల!...'' తల్లినించి కన్నీళ్ళు దాచుకోవాలని చూసింది.

ఆ తర్వాత విజయకి చాలసేపు నిద్ర పట్టలేదు. నిజంగా ఆయన అలా అయి వస్తారా? హే భగవాన్, నిజంగా ఆయన అలా అవిటివారుగా అయిపోయారా? తెల వారుజామున వచ్చే కలలు నిజమవుతాయంటారు?......విజయ మనసు భయాందోళనలతో కంపించింది.

ఒకవేళ నిజంగా ఆయన కలలో మాదిరి వస్తే......తను అలాగే ప్రవర్తిస్తుందా? విజయ కలలో తన ప్రవర్తనని అసహ్యించుకుంది. ఛా.....తన్నెన్నటికి అంత అమానుషంగా ప్రవర్తించదు .ఏమైనా ఆయన తన భర్త! ఆయన తన విధి నిర్వర్తించారు. తను తన విధి నిర్వర్తించాలి, నిర్వర్తిస్తుంది.... ఆయనకి తన ప్రేమాభిమానాల గురించి ఎలాంటి సందేహానికి తావీయదు. ఆయనకి కాళ్ళు చేతులు లేకపోతే తనకున్నాయి. ఆయనకి కళ్ళులేకపోతే తన కళ్లతో ఆయనకి వెలుగునిస్తుంది. తన కంఠంలో ప్రాణముండగా అంత బలహీనతకి దిగజారి అంత నీచంగా, అమానుషంగా ఎన్నటికీ ప్రవర్తించదు....

విజయ దృఢంగా నిశ్చయించుకుంది. మర్నాడు ఏమైనా ఎదుర్కోడానికి ఆమె సిద్ధం అయింది. ఏది, ఎలావున్నా ఆయనకి సంతోషంగా స్వాగతమిస్తుంది.

ఏవేవో ఆలోచనల్తో, ఆనందం, విచారం కాని నిర్లిప్తతతో, మగతతో ఆమె నిద్రమరచిన వేళ ........

తెల్లవారింది.

**అంకితం : పాకిస్తాన్‌తో పోరాటంలో ఖైదీలైన తెలుగు సిపాయిలకి.**

